విశాలాంధ్ర
గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమ గోదావరి

విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేత

విశాలాంధ్ర-భీమవరంటౌన్: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో తెలుగు పద్యాల పోటీలు, ఉచిత నోట్ పుస్తకాలు ఆదివారం పంపిణీ చేశారు. జిల్లా సర్వోదయ మండలి అధ్వ ర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మధ్యాహ్న భోజన పథక కో ఆర్డినేటర్ కేవీ కృష్ణారావు పాల్గొని మాట్లాడుతూ పెద్ద మేధావులు కూడా హాస్టల్‌లో ఉండి చదువుకునే చరిత్ర సాధించారని, ప్రభుత్వాలు బాలికల్లో విద్యా నైపుణ్యాలను పెంపొందించాలని, ఎంతో ఖర్చుతో హాస్టల్స్‌ను నడుపుతున్నారన్నారు. వీటికి స్వచ్ఛంధ సంస్థలు కూడా సహకరించడం అభినందనీయమన్నారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టల్స్ లో బాలికలు ఎంతో ఉత్సాహంగా చదువుతున్నారని, ఇదే హాస్టల్స్ నుంచి పలువురు ప్రతిభావంతులు గుర్తింపు పొందారన్నారు. న్యాయవాది ఉండపల్లి రమేష్ నాయుడు, భట్టిప్రోలు శ్రీనివాస్, గంటా సుందర కుమార్, కొండ్రు శ్రీనివాస్, కే శిరీష, వార్డెన్ జి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థికి నగదు పురస్కారం

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: కొయ్యలగూడెం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాలలో మంచి ఉత్తీర్ణత సాధించిన కొత్త పల్లవికి ట్రిపుల్ ఐటీలో సీటు రావడంతో కొయ్యలగూడెం పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు కొల్లూరు సత్తిబాబు రూ.5వేల నగదును విద్యార్థినికి అందజేశారు. ప్రపంచ ఆర్యవైశ్య సంఘ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు కే సాయి కృష్ణ, ఎస్ సుధాకర్, కే గరటయ్య, బీ పాపారావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ఉదయం గం.10 నుంచి 'స్పందన' కార్యక్రమం నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ వై ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాలల్లోను 'స్పందన' కార్యక్రమం ఉదయం గం.10 నుంచి యధావిధిగా నిర్వహించబడుతుందన్నారు.

కనకదుర్గమ్మకు ఆషాఢ సారె

విశాలాంధ్ర-వీరవాసరం: ఆషాఢ మాసం సందర్భంగా వీరవాసరంలో కొలువైన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి గ్రామస్థుల ఆధ్వర్యంలో ఆషాఢ సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. గ్రామంలో వేర్వేరు ఆలయాల నుంచి భక్తులు పసుపు, కుంకుమ, గాజులు, పువ్వులు, పండ్లు, వివిధ రకాల మిఠాయిలు తీసుకువచ్చి కనకదుర్గమ్మకు సమర్పించారు. ఆలయ అర్చకుడు కొడమంచిలి దుర్గాప్రసాద్ వాటికి సంప్రోక్షణ చేసి అమ్మవారికి నివేదించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కందుల సురేష్, సర్పంచ్ చికిలే మంగతాయారు, మహిళలు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, ఆలయ సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

పురందేశ్వరిని కలిసిన బీజేపీ నాయకులు

విశాలాంధ్ర-గణపవరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ నూతన అధ్యక్షురాలిగా ఇటీవల నియమితులైన దగ్గుపాటి పురందేశ్వరిని బీజేపీ నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసినట్లు బీజేపీ గణపవరం మండల అధ్యక్షులు కొయ్యల వెంకట సుబ్బారావు తెలిపారు. ఆమెను కలిసిన వారిలో ఏలూరు పార్లమెంట్ జిల్లా జనరల్ సెక్రెటరీ కె కృష్ణప్రసాద్, నిడమర్రు మండల సీనియర్ నాయకులు సీబా డైరెక్టర్ పెనుమచ్చ రామచంద్ర రాజు, ఉంగుటూరు బిజెపి ఇన్‌చార్జి ఇంటి ఉదయభాస్కర్ (చంటి), బీజేపీ నిడమర్రు మండల అధ్యక్షుడు అచ్యుత భాస్కరరావు, కొయ్యల వెంకట సుబ్బారావు, మండల సీనియర్ నాయకులు ఇందుకూరు అశోక చక్రవర్తి వర్మ ఆమెను సన్మానించి అభినందనలు తెలిపారు.

నూజివీడులో నేడు రైతు సంఘం సమావేశం

విశాలాంధ్ర- ముసునూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను, కౌలు రైతులను దోచుకుంటున్నాయని వాటిని కట్టడిచేసేందుకుగాను అమర్‌భవన్‌లో రైతులు, కౌలు రైతులకు సోమవారం సమావేశం ఉందని, తప్పనిసరిగా హాజరుకావాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏలూరు జిల్లా కన్వీనర్ రాయ్యంకుల లక్ష్మణరావు పిలుపునిచ్చారు. నూజివీడులోని సీపీఐ కార్యాలయంలోని అమర్‌భవన్‌లో సోమవారం ఈ సమావేశం జరుగుతుందన్నారు. నూజివీడు డివిజన్ పరిధిలో ముసునూరు, ఆగిరిపల్లి, నూజివీడు, చాట్రాయి మండలాల రైతులు, కౌలు రైతులు హాజరుకావాలని, ఈ సమావేశంలో రైతులకు పామాయిల్ మొక్కల సబ్సిడీ, రసాయినిక ఎరువుల రేట్లు పెరుగుదలపై చర్చ ఉంటుందని, తప్పకుండా హాజరుకావాలని కోరారు.

శాకంబరిగా చింతాలమ్మ

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: కొయ్యలగూడెం తూర్పు పేట రామాలయం వద్ద ఉన్న శ్రీశ్రీశ్రీ చింతాలమ్మ అమ్మవారిని ఆలయ కమిటీ సభ్యులు బెల్లనా శ్రీనివాస్, రౌతు శ్రీనివాస్ ఆధ్వర్యంలో శాకంబరిగా అలంకరించారు. ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారిని శాకాంబరి దేవిగా అలంకరించినట్టు వారు తెలిపారు. భక్తులు విశేషంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జగనన్నకు చెబుదాం అర్జీలు వేగంగా పరిష్కారం



విశాలాంధ్ర-భీమవరం: జగనన్నకు చెబుదాం ద్వారా అందుతున్న అర్జీల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు సంబంధిత శాఖల అధికారులు పూర్తి చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో జేకేసీ ద్వారా మే 9 నుంచి మొత్తం 4,932 అర్జీలు రాగా, ఇప్పటి వరకు 3,685 అర్జీలను పరిష్కరించినట్లు తెలిపారు. ఇంకా పరిష్కరించాల్సిన 919 అర్జీలను నిర్ణీత గడువు లోపుగా పరిష్కరిస్తామని చెప్పారు. జేకేసీ ద్వారా ఎక్కువగా ఎలక్ట్రిసిటీ లోవోల్టేజ్, ఆర్ఓఆర్, పోలీస్, శానిటేషన్, తాగునీటి సమస్యలపై అర్జీలు అందుకున్నట్టు వివరించారు. అర్జీల పరిష్కారం అయిన తర్వాత అర్జీదారానికి ఫోన్ చేసి సమస్య పరిష్కారం విధానంపై కూడా వివరాలను అడిగి తెలుసుకుంటున్నామని చెప్పారు. అర్జీదారుడు సంతృప్తి చెందకపోతే రీ ఓపెన్ చేసి అర్జీని సమీక్షిస్తున్నామన్నారు. అర్జీదారునికి మేలైన పరిష్కారం చూపడంలో సంబంధిత శాఖల అధికారులు కృషి చేస్తున్నారన్నారు.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం
మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వెంకటేశ్వరరావు, లాజరు

వెంకటేశ్వరరావు

లాజరు

విశాలాంధ్ర చింతలపూడి: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) చింతలపూడి మండల అధ్యక్ష కార్యదర్శులుగా ఇస్తరాకుల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ముళ్ళగిరి లాజరు ఎన్నికైనట్లు నూతనంగా ఎన్నికైన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తెలిపారు. శనివారం చింతలపూడి పట్టణంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆదివారం మండల కమిటీ ఎన్నిక, మహాసభ తీర్మానాల వివరాలను విలేకరులకు గౌరవాధ్యక్షులుగా సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, కోశాధికారిగా నారప వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా వనం కృష్ణ, సహాయ కార్యదర్శిగా ఎస్.కె మస్తాన్, కమిటీ సభ్యులుగా చిట్లూరి ప్రసాద్, బోడ లక్ష్మణరావు, సికాకోలు బాబురావు, బూరుగు నాగమ్మ, ఎం లక్ష్మణరావు తదితరులను ఏకగ్రీవంగాఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు, లాజరు మాట్లాడుతూ మహిళలకు వృద్ధాప్య పెన్షన్ కి వయసును 50 సంవత్సరాలుగా పరిగణించాలని తీర్మానించినట్లు తెలిపారు. ఎర్రగుంటపల్లి, రేచర్ల విఎస్ఎస్ లో పెంచిన జామాయిల్ కటింగ్‌కు అనుమతి ఇచ్చి వచ్చిన నగదును వి ఎస్ ఎస్ సభ్యులకు జమ చేయాలని, అటవీ భూములను విఎస్ఎస్ సభ్యులకు వ్యక్తిగతంగా ఒక హెక్టార్ చొప్పున కేటాయించాలని మహాసభ తీర్మానించిందన్నారు. అర్హులైన పేదలకు 3 సెంట్లు ఇళ్ల స్థలం ఇవ్వాలని దాని నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని లేదా ప్రభుత్వమే నిర్మించాలని, గ్రామీణ ఉపాధి పథకం పనులను 200 రోజులు కేటాయించి రోజుకి రూ.600 వేతనం ఇవ్వాలని తీర్మానించినట్లు తెలిపారు.

రెవెన్యూ గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-ఏలూరు: రెవెన్యూ అతిథి గృహం నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వై ప్రసన్న వెంకటేశ్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ రోడ్డు గిరిజన భవన్ పక్కన గల రెవెన్యూ అతిథి గృహం పాత భవనం స్థానంలో కొత్తగా నిర్మిస్తున్న భవనం నిర్మాణ పనులను ఆదివారం జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా అతిథి గృహం చుట్టూ మొక్కలతో గార్డెనింగ్ ఏర్పాటు చేయాలన్నారు. నిర్మాణ పనులు పూర్తి నాణ్యతతో ఉండేలా చూడాలని, ఇంటీరియర్ కూడా ఆకర్షణీయంగా ఉండేలా నిర్మాణ పనులు ఉండాలన్నారు. నిర్దేశించిన సమయం లోగా నిర్మాణ పనులు పూర్తి చేయాలనీ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆఫీసర్స్ క్లబ్ ని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సందర్శించారు. ఆఫీసర్స్ క్లబ్ లో ఏర్పాటు చేసిన జిమ్, వ్యాయమ పరికరాలను కలెక్టర్ పరిశీలించి, జిల్లా అధికారులందరూ ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు ఆఫీసర్స్ క్లబ్ లో ప్రత్యేక వ్యాయమ హాలు, ఆధునిక వ్యాయమ పరికరాలు ఏర్పాటు చేశామని, జిల్లా అధికారులందరూ ఆ అవకాశాన్ని వినియోగించుకుని, ప్రతీ రోజు వ్యాయాయం చేసి ఆరోగ్యాన్ని పరిరక్షించుకునేలా జిల్లా అధికారుల సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ ఎస్. వెంకట కృష్ణ, ఏఈ రాఘవేణి, తహసీల్దార్ సోమశేఖర్, కాంట్రాక్టర్ రాజు, ప్రభృతులు పాల్గొన్నారు.

నాపై ముద్దరబోయిన కక్ష కట్టారు: సతీశ్

విశాలాంధ్ర-చాట్రాయి: టీడీపీ నూజివీడు నియోజకవర్గ ఇన్చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు తనపై వ్యక్తిగతమైన కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని తెలుగు యువత మండలాధ్యక్షుడు బొంతు సతీష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని చనుబండ గ్రామంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేష్‌ల విజయం కోసం పార్టీ పురోభివృద్ధి కోసం మండలంలో తెలుగు యువత అధ్యక్షునిగా అనేక కార్యక్రమాలు నిర్వహించానన్నారు. కరోనా కాలంలో పంచాయతీ పరిధిలో ప్రజలకు కూరగాయల పంపిణీ చేశానని గుర్తు చేశారు. చనుబండ పంచాయతీలో కష్టకాలంలో కూడా రెండు వార్డులలో తన కుటుంబం నుంచి పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కుటుంబాల కోసం కార్యకర్తల కోసం కష్టపడుతున్న మాజీ ఏఎంసీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లోకేష్ 2వేల కిలోమీటర్ల పూర్తి అయిన సందర్భంగా జరిపిన సంఘీభావ సభలో నియోజకవర్గంలోని పెద్ద పెద్ద నాయకులు నూజివీడు పట్టణ నాయకులు అనేకమందితో పాటు తాను కూడా పాల్గొన్నారు. కాపాశ్రీనివాసరావు మాట్లాడిన వీడియో క్లిప్పింగ్లను సామాజిక మాధ్యమాల్లో పార్టీ వాట్సాప్ గ్రూపులలో షేర్ చేయడం వలన తనను పార్టీ వాట్సప్ గ్రూపుల నుంచి డిలీట్ చేశారన్నారు. తెలుగు యువత చాట్రాయి మండల అధ్యక్ష పదవి బాధ్యతల నుంచి తొలగించారన్నారు. అది పార్టీ వ్యతిరేక చర్య అయినప్పుడు కాపా దగ్గర మొదలుపెట్టి నియోజకవర్గంలో వందలాది మందిని చేయాల్సి ఉందన్నారు. కనీసం తనను వివరణ అడగకుండా తనకు ఏ విధమైన షోకాజ్ నోటీసులు ఇవ్వకుండా పై కమిటీల నాయకులు ఎవరూ తనతో చర్చించకుండా ఏకపక్షంగా తనను ఒక్కడిని మాత్రమే పదవి నుండి తొలగించడమేమిటిని ప్రశ్నించారు. టీడీపీ చాట్రాయి మండల అధ్యక్షులుగా ఉన్న మరిడి చిట్టిబాబు ఆదేశానుసారమే తాను పర్వతనేని గంగాధర్ నిర్వహించిన సేవా కార్యక్రమాల్లోనూ, మాజీ ఏఎంసీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు కార్యక్రమాల్లోనూ పాల్గొన్నానని గుర్తు చేశారు. మరిడి చిట్టిబాబు మాతో తనకు నచ్చిన విధంగా పనులు చేయించి ఇప్పుడు యూటర్న్ తీసుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారని ఆరోపించారు. గంట గంటకు తాను గ్రూపులను మార్చలేనన్నారు. తనను తీసిన స్థానంలో బలహీన వర్గాలకు ఇవ్వడం మంచిదేనన్నారు. కీర్తిశేషులు మండల పార్టీ మాజీ అధ్యక్షులు బొట్టు విజయ్ చౌదరి సతీమణి వరలక్ష్మి చీపురుగూడెం పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవికి పోటీ చేయగా కోటపాడు గ్రామంలో టిడిపి బాధ్యతలు నిర్వహిస్తున్న వారు పంచాయతీ ఎన్నికల నుండి చివరి నిమిషంలో పోటీ విరమించుకోవడం వలన పరోక్షంగా విజయ్ చౌదరి గెలవలసిన పంచాయితీ వైసిపి గెలవడానికి దోహదపడిన వారి నాయకత్వాన్ని బలపరుస్తూ వారి అనుయాయులకు మండల స్థాయిలో బీసీ పేరు అడ్డుపెట్టుకొని బాధ్యతలు అప్పగించడం కోవర్టును బలపరచడం కాదా అని ప్రశ్నించారు. కృష్ణారావు పాలెంలో టిడిపి గెలవాల్సిన ఎంపీటీసీ స్థానంలో తెలుగుదేశంలో ఉంటూ వైసీపీ గెలుపుకు కారణమైన వారు వైసిపి గెలిచిన అభ్యర్థితో ఒకేదండని ఇద్దరు వేసుకొని ఫోటోలకు ఫోజులు ఇచ్చిన వారిని వెనకేసుకుని తిరిగే వారిని ఏ పేరుతో పిలవాలన్నారు. నేను ఆత్మాభిమానంతో పని చేసే వాడినని నా ఆత్మగౌరవం కోసం నేను ఆమరణ దీక్ష చేయడానికి కూడా వెనకాడనన్నారు. పార్టీ అధినేత దృష్టికి ముద్దరబోయిన అరాచకాలు తీసుకువేళ్ళే వరకు నా పోరాటం ఆగదన్నారు. టిడిపి ఎవరు జాగీర్ కాదన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ కందుల కృష్ణ ,సీనియర్ నాయకులు బన్నే వీరస్వామి, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అ'పూర్వ' సమ్మేళనం

విశాలాంధ్ర-కాళ్ళ: కాళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992-93లో పదోతరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఆనందోత్సహాల మధ్య సాగింది. దేశ, విదేశాల్లో స్థిరపడిన విద్యార్థులంతా తమతో చదివిన విద్యార్థులను కలిసేందుకు అందరూ ఒకచోట కలిశారు. పాత జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు. విద్యార్థి దశలో చేసిన అల్లరి పనులను తీపి పనులను గుర్తు చేసుకున్నారు. తమతో చదివిన 160 మంది పైబడిన విద్యార్థులను సమీకరించి వాట్సాప్ గ్రూప్ ద్వారా అందర్నీ కలిపి ఒక వేదిక మీదకి చేరారు. తమ పాఠశాలలో కలిసి, చదువు చెప్పిన గురువులను సన్మానించాలనే సంకల్పంతో పూర్వ విద్యార్థుల కలయిక కార్యక్రమానికి కొందరు విద్యార్థులు నాంది పలికారు. రెండు నెలలుగా శ్రమించి అందరి వివరాలు సేకరించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పి ఇంతటివారిని చేసిన గురువులను ఘనంగా సన్మానించారు. పాఠశాలలో చేసిన కొంటె పనులను గుర్తు చేసుకున్నారు. పాఠశాలకు అవసరమయ్యే విద్యుత్, వైఫై, కుర్చీల ఏర్పాటు నిమిత్తం రూ.60 వేలు అందించారు.

'మృత్యువు' వాల్ పోస్టర్స్ విడుదల

విశాలాంధ్ర-భీమవరం: దివ్యాంగుల సమస్యలు ప్రతిబింబిస్తూ వారిలోని నిబిడీకృతమైన అంతర్లీన శక్తులను వెలికి తీసి సమాజాన్ని జాగృతం చేసేసేలా నిర్మితమవుతున్న 'మృత్యువు' చిత్రం విజయవంతం కావాలని సెన్సార్ బోర్డు సభ్యులు కంతేటి వెంకట్రాజు అన్నారు. విశ్వ జాగృతి మూవీస్ బ్యానర్ పై పోశింసెట్టి మురళి సమర్పణలో నిర్మితమవుతున్న 'మృత్యువు' టెలిఫిలిం వాల్ పోస్టర్స్ ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్రంలోని ఇతివృత్తం ఖచ్చితంగా సమాజానికి మంచి మెసేజ్ ను అందిస్తుందని యూనిట్ సభ్యులకు భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు రావాలని శుభాకాంక్షలు అందచేశారు. కార్యక్రమంలో దర్శకుడు వరుణ్ రాజ్, నిర్మాతలు బలరామ్ నాయకర్, పోశింసెట్టి మురళి, ఛాన్ భాషా, పురప్రముఖులు కుక్కల బాల, గొన్నాబత్తుల మల్లేశ్వరరావు తదితరులు మాట్లాడారు. ఎ.పి.ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఎం.సీతారాంప్రసాద్, డాక్టర్ ఎ.శ్రీరామ్, బుల్లెట్ వర్మ, జవ్వాది దాశరథి, హరినారాయణ శర్మ, అబ్దుల్ సుభాని, డి.ఒ.పి.నాయుడు, యూనిట్ సభ్యులు బలరామ్ నాయకర్, మధు, ఆనంద్, మురళి, సుబ్బారావు, పలువురు కళాకారులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు అమలు కోసం పోరాడాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు పేర్కొన్నారు. కొయ్యలగూడెం మండలం పెయింటర్ వర్కర్స్ సంఘం నాయకులు చీదరాల రామకృష్ణ గుండెపోటుతో మరణించడంతో చీదరాల రామకృష్ణ సంతాప సభ ఆదివారం కొయ్యలగూడెంలో మరడాని శ్రీనివాసు అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన రమణారావు. రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల స్థాయిలో యూనియన్లు బలపడాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు అమలు కోసం మండల క్షేత్రస్థాయి పోరాటాల ద్వారానే సాధ్యమవుతుందని, కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా పోరాడాలని ఆయన తెలిపారు. ఈ సభలో సిఐటియు జిల్లాఉపాద్యాక్షుడు శుక్ల బోయిన రాంబాబు, ముదునూరి రామకృష్ణ రాజు, మారిన పేర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

రూ.47 వేల గంజాయి స్వాధీనం

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: 23.6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలవరం సిఐ కే. విజయ్ బాబు విలేకరులకు తెలిపారు. సి ఐ తెలిపిన వివరాల ప్రకారం విశాఖ జిల్లా నుండి తెలంగాణ రాష్ట్రం హైదరాబాదుకు లారీలో తరలిస్తున్న 23.6 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ గంజాయి విలువ రూ.47 వేలు ఉంటుందన్నారు. గంజాయి రవాణా చేస్తున్న వారి డ్రైవర్ తన లారీని ఆపి తప్పించుకొని పారిపోతుండగా ఎస్ఐ విష్ణువర్ధన్ వెంబడించి పట్టుకునే క్రమంలో ఆయనకు గాయాలైనట్లు తెలిపారు. డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కొయ్యలగూడెం ఎస్ఐ విష్ణువర్ధన్, హెడ్ కానిస్టేబుల్ బాబురావు, ప్రసాద్, రాజు, గణేష్, పోలీస్ సిబ్బంది, డిప్యూటీ తాసిల్దార్ శ్రీనివాస్, వి ఆర్ ఓ మోహనరావు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ అరెస్ట్

విశాలాంధ్ర-నూజివీడు: మండలంలోని తుక్కులూరు వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్ఐ సాయినాధ్ మృతికి కారణమైన లారీ డ్రైవర్ పావులూరి శ్రీనివాసరావును అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు నూజివీడు డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్ తెలిపారు. రోడ్డు ప్రమాదానికి సంబంధించి వివరాలను డీఎస్పీ ఆదివారం విలేకరుల సమావేశంలో వివరించారు. మద్యం తాగి అతి వేగంగా, అజాగ్రత్తగా లారీ నడపడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని డీఎస్పీ తెలిపారు. ద్విచక్ర వాహనంపై వస్తున్న ఏలూరు కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న గూడవల్లి సాయినాధ్‌ను ఢీకొనడంతో అతను ఘటనా స్థలంలోనే మృతి చెందాడని, అలానే మరో ఆటోను ఢీ కొనగా ఆటో నడుపుతున్న వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డాడని వివరించారు.

వైసీపీ పాలనలో మహిళల అభివృద్ధి

విశాలాంధ్ర- లింగపాలెం: మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం ఇస్తున్న ముఖ్యమంత్రి జగనన్న ప్రోత్సాహంతో రాష్ట్రంలో ముందు ఎన్నడూ లేని విధంగా మహిళలు అభివృద్ధి చెందుతున్నారని ఎమ్మెల్సీ ఎలీజా అన్నారు. నరసన్నపాలెంలో మండల పరిషత్ అధ్యక్షురాలు ముసునూరు వెంకటలక్ష్మి నివాసంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ఆరోపణలను నమ్మవద్దని ఈయన అన్నారు. ప్రతీ వ్యక్తి మనస్సాక్షిగా పరిశీలించుకుంటే జగనన్న పాలనలో జరిగిన అభివృద్ధిలో వాస్తవాలు తెలుస్తాయని అన్నారు. కేవలం అసత్య ఆరోపణలతో ప్రజలను మధ్య పెట్టేందుకు ప్రతిపక్షాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఆర్థికంగా రాజకీయంగా, సామాజికంగా రాష్ట్రంలోని మహిళలు అభివృద్ధి పథంలో ఉన్నారని ఈయన వివరించారు. అనారోగ్యంతో ఉన్న ఎంపిపిని ఎంఎల్ఏ దంపతులు పరామర్శించారు. ఎంపిపి భర్త ముసునూరి వెంకటేశ్వరరావు ఎంపిపిగా ముసునూరు వెంకటలక్ష్మి ప్రజలకు చేసిన సేవలు చేస్తున్న సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ దంపతులకు భగవంతుడు అన్ని విధాలుగా అండగా ఉంటాడని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు మందలపు సాయిబాబ, పి వేమనరెడ్డి, గుర్రాల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ బైక్ ర్యాలీ

విశాలాంధ్ర-పాలకొల్లు: పాలకొల్లులో సోమవారం జరిగే బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు. స్థానిక శాసన సభ్యుల క్యాంపు కార్యాలయంలో నియోజక వర్గం లోని ముఖ్య నాయకులతో భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం కార్యాచరణ పై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నిమ్మల రామానాయుడు మాట్లుడుతూ 5 కోట్ల ఆంధ్రుల భవిష్యత్తుకు గ్యారంటీ ఇస్తూ చంద్రబాబు మినీ మ్యాని ఫెస్ట్ ను విడుదల చేయడం జరిగిందన్నారు. టిడిపి మేనిఫెస్టో పథకాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లే విధంగా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న బస్సు యాత్రలో భాగంగా పాలకొల్లు నియోజకవర్గంలో సోమవారం ఉదయం గం. 10 నుండి దగ్గులూరులో ప్రారంభంమై నియోజకవర్గం మొత్తం తిరుగుతుందన్నారు. సాయంత్రం గం.3లకు పాలకొల్లు నుండి బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. అనంతరం సాయంత్రం గం.5లకు బ్రాడీపేట బైపాస్ రోడ్‌లోని ఎస్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో సభా కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.

సమస్యల పరిష్కారం కోసం జగనన్న సురక్ష

విశాలాంధ్ర-పాలకొల్లు: అసంపూర్తిగా ఉన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్ష అని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. వైసీపీ కార్యాలయం నందు కవురు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పత్రికా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఎటువంటి ఖర్చు లేకుండా వాలంటీర్ల ద్వారా సచివాలయాల్లో అందుబాటులో సేవలు ఉంటాయన్నారు.ముఖ్యమంత్రి జగన్ పేద ప్రజల కష్టాలు తెలుసుకునేందుకు 3648 కిలోమీటర్లు పాదయాత్ర చేసి నవరత్న పథకాన్ని ప్రవేశపెట్టి అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అధికారం రాకముందు చెప్పిన విధంగా అధికారంలోకి వచ్చాక మేనిఫెస్టోకి అదనంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. పాలకొల్లు మండలం దగ్గులూరు గ్రామంలో రూ.470 కోట్లతో మెడికల్ కళాశాలను నిర్మిస్తున్నామని, రైతులకు ఇన్పుట్ సబ్సిడీ పంట నష్టపోయిన వెంటనే వారికి పరిహారం అందజేస్తున్నామని రైతు భరోసా సంవత్సరానికి రూ.13 వేల 500 అందిస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వాన్నిదేన్నారు.

ఫారం G
ఆసక్తి వ్యక్తీకరణ కొరకు ఆహ్వానము
M/s.శ్రీవెన్ ఇన్ఫోకామ్ లిమిటెడ్
హైదరాబాద్ నందు IT సర్వీసెస్‌ను ఆపరేటింగ్ చేస్తున్నది

ఇన్సాల్వెన్సీ మరియు బ్యాంక్రప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా (కార్పొరేట్ వ్యక్తుల కొరకు ఇన్సాల్వెన్సీ తీర్మాన ప్రక్రియ) రెగ్యులేషన్స్, 2016లోని రెగ్యులేషన్ 36ఎ(1) క్రింద

సంబంధిత వివరములు

1.	కార్పొరేట్ డెటార్ యొక్క పేరు వారి PAN/CIN/LLP No.	M/s.శ్రీవెన్ ఇన్ఫోకామ్ లిమిటెడ్ U72200TG2001PLC038202
2.	రిజిష్టర్డ్ ఆఫీస్ యొక్క చిరునామా	ఫ్లాట్ నెం.201, హెచ్.నెం. 7-1-396/2/10/1/201, శ్రీ వెంకట్ రెసిడెన్సీ బికె గూడ, హైదరాబాద్-500018
3.	వెబ్‌సైట్ యొక్క URL	www.sreeveninfo.com
4.	స్థిరాస్తులలో ఎక్కువభాగం ఉన్న స్థలం వివరాలు	హైదరాబాద్
5.	ప్రధాన ఉత్పత్తులు / సర్వీసుల ఇన్‌స్టాల్‌చేయబడిన సామర్థ్యం	వర్తించవు
6.	గత ఆర్థిక సంవత్సరంలో విక్రయించబడిన ప్రధాన ఉత్పత్తులు / సేవల పరిమాణం / విలువ	వర్తించవు
7.	ఉద్యోగులు / కార్మికుల సంఖ్య	లేవు
8.	రెండు సంవత్సరాలుగా అందుబాటులో ఉన్న ఆర్థిక నివేదికలు (షెడ్యూల్స్‌తో) రుణదాతల జాబితా, ప్రక్రియ యొక్క తదుపరి ఈవెంట్‌ల సంబంధిత తేదీలతో సహా మరిన్ని వివరాలు:	ip.sreeveninfocom@gmail.com కు ఇమెయిల్ పంపడం ద్వారా పొందవచ్చు
9.	కోడ్‌లోని సెక్షన్ 25(2)(h) క్రింద రిజల్యూషన్ దరఖాస్తుదారుకు కావలసిన అర్హతలు	ip.sreeveninfocom@gmail.com కు ఇమెయిల్ పంపడం ద్వారా పొందవచ్చు
10.	ఆసక్తి వ్యక్తీకరణను స్వీకరించడానికి చివరి తేదీ	1 ఆగస్టు 2023
11.	కాబోయే రిజల్యూషన్ దరఖాస్తుదారుల ప్రొవిజనల్ జాబితా జారీ తేదీ	11 ఆగస్టు 2023
12.	ప్రొవిజనల్ జాబితాపై అభ్యంతరాల సమర్పణకు చివరి తేదీ	16 ఆగస్టు 2023
13.	EOIని సబ్మిట్ చేయడానికి ఇమెయిల్ అడ్రస్:	ip.sreeveninfocom@gmail.com

తేది : 17.07.2023
ప్రదేశం: హైదరాబాద్

సం/- కృష్ణమోహన్ గొళ్ళమూడి,
దివాలా పరిష్కార నిపుణులు
For శ్రీవెన్ ఇన్ఫోకామ్ లిమిటెడ్
IBBI/IPA-003/IP-N000161/2018-19/11952
Regd with IPA of ICAI AFA Valid upto 02-01-2024
ఫ్లాట్ నెం.107, మౌర్య టవర్స్, హెచ్.నెం.1-9-648, అడిక్‌మెట్ రోడ్డు, విద్యానగర్, హైదరాబాద్-500 044